ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం అక్టోబరు 5, 2024


## అట్టహాసంగా దసరా వేడుకలు ఆరంభం


ఆదిలక్ష్మి అమ్మవారి అలంకారంలో...

**నేడు సంతానలక్ష్మి అలంకారం**

భద్రాచలం, న్యూస్‌టుడే: విజయదశమి మహోత్సవాలు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కోవెలలో శుక్రవారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. రామాయణ పారాయణం ఆధ్యాత్మికతను చాటగా, భజనలు భక్తి భావనలు పంచాయి. ఉత్సవాల్లో మొదటి రోజున ఆదిలక్ష్మి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీతాయారు కోవెలలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు సాగాయి. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారి ఎదుట పాహిమాం అంటూ ప్రణమిల్లుతూ మురిసిపోయారు. తమను చల్లంగ చూడాలంటూ వేడుకున్నారు. మంత్రోచ్ఛారణ మార్మోగుతుండగా చిత్రకూట మండపంలో రామాయణ పారాయణం సాగింది. ఉత్సవ ఏర్పాట్లను ఈఓ రమాదేవి పర్యవేక్షించారు. అమ్మవారు శనివారం సంతానలక్ష్మిగా దర్శనమిస్తారు. ఈ రూపంలోని అమ్మను ఆరాధిస్తే సుఖశాంతులు కలుగుతాయని, అవరోధాలన్నీ తొలగి సత్సంతానం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు.

# మంట నూనెలు..!



ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

**పండగల ముందు ధరలు పైపైకి**

పండగలకు ముందు వంటనూనెల ధరలు మండుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం సుంకం పెంచటంతో వంట నూనెల ధరలు భగ్గుమంటున్నాయి. పక్షం రోజుల వ్యవధిలోనే ఒక్కో కంపెనీ లీటరు నూనెపై రూ.10 నుంచి రూ.30 వరకు పెంచటం ఆశ్చర్యం కలిగించే అంశం. అంతర్జాతీయంగా ఏర్పడిన ప్రతికూల పరిస్థితులు ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. రెండేళ్లలో ఎప్పుడూ లేనిదిగా ధరలు పెరగటం వల్ల ప్రజలపై కోలుకోలేని భారం పడింది.

### యుద్ధాల ప్రభావం..

ప్రస్తుతం ఇరాన్- ఇజ్రాయెల్, ఉక్రెయిన్- రష్యా మధ్య జరుగుతున్న యుద్ధాలు కూడా ధర పెరుగుదలకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. పొద్దుతిరుగుడు నూనెను 60శాతం వరకు ఉక్రెయిన్, రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం వల్ల ముడిచమురు ధర పెరగటం వల్ల వంట నూనెల ధరలు మరింత మండిపోతున్నాయి. పామాయిల్‌ను అత్యధిక శాతం మలేషియా, ఇండోనేషియా నుంచి ముడిచమురు రూపంలో దిగుమతి చేసుకుంటున్నాం. ఇక్కడికి వచ్చిన తర్వాత కర్మాగారాల్లో శుద్ధిచేసిన తర్వాత రకరకాల కంపెనీలు వివిధ బ్రాండ్లతో నూనెను విక్రయిస్తున్నాయి.

### ఉభయ జిల్లాల్లో..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గృహ, వాణిజ్య అవసరాల కోసం ప్రతినెలా సుమారు 4,200 మెట్రిక్ టన్నుల వంట నూనెను వినియోగిస్తారు. ప్రధానంగా పొద్దుతిరుగుడు, పామాయిల్, వేరుసెనగ, రైస్‌బ్రాన్, ఇతర నూనెలు వాడతారు. పెరిగిన ధరల కారణంగా ఉభయ జిల్లాల్లో వినియోగదారులపై రూ.కోట్ల భారం పడుతోంది. దసరా, దీపావళి, ఆ తర్వాత జాతీయ పండగల దృష్ట్యా ధరలు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### దిగుమతి సుంకం పెరగటంతో..

ముడి చమురుపై దిగుమతి సుంకాన్ని 5.50 నుంచి 22 శాతానికి, శుద్ధి చేసిన వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 13.75 నుంచి 35.75 శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం గత నెలలో నిర్ణయం తీసుకుంది. తద్వారా వినియోగదారులపై భారం పెరుగుతోంది. దేశంలో అవసరాలకు సరిపడా వంట నూనెలు తయారుకాకపోవటం, ఇతర దేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకోవటం వల్ల ధరల్లో పెరుగుదల ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

| నూనెల ధరల్లో వ్యత్యాసం (రూ.లలో) | పామాయిల్ | పొద్దుతిరుగుడు | వేరుసెనగ | రైస్‌బ్రాన్ |
|---|---|---|---|---|
| 15 రోజుల క్రితం | 95 | 113 | 140 | 120 |
| ఈనెల 4న | 125 | 135 | 150 | 135 |

# పంటల బీమా.. పట్టాలెక్కేనా..?

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోతున్న రైతులను ఆదుకునే మార్గాలు కనిపించటం లేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫసల్‌బీమా పథకం రాష్ట్రంలో అమలుకు నోచుకోవటం లేదు. కొన్నేళ్లుగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పంటలు నష్టపోతున్న రైతులకు అరకొరగా పరిహారం చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకొంటోంది. ఫసల్ బీమా పథకంతో అనుసంధానమై సమగ్ర పంటల బీమా పథకాన్ని రూపొందించి అన్నదాతలను ఆదుకుంటామని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించినా మార్గదర్శకాలు వెలువడలేదు.



నా పేరు జరుపుల పూల్యా. మాది ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసితండా. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెండెకరాల వరిపొలం కొట్టుకుపోయింది. పెట్టుబడి రూ.80వేలు నీటిపాలయ్యాయి. మరో రూ.లక్ష వెచ్చించి మోకాలులోతు ఇసుక మేటలను తొలగించాను. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాను.

### అన్నదాతలకు గుండెకోత

ఉభయ జిల్లాల్లో సెప్టెంబర్ మొదటి వారంలో అతిభారీ వర్షాలు, వరదలు అన్నదాతలకు గుండెకోత మిగిల్చాయి. ఖమ్మం జిల్లాలో 68,345, భద్రాద్రి జిల్లాలో 2,982 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. జిల్లా అధికారులు పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినా ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటల బీమా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ముందే విడుదల చేసి ఉంటే ఎంతోకొంత ఉపశమనం లభించేదని వాపోతున్నారు.

**సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)** ఖమ్మం : 5,82,000 భద్రాద్రి : 5,80,304



ఫసల్ బీమా పథకం విధివిధానాలపై స్పష్టత లేదు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వెలువడితే తదనుగుణంగా పథకం అమలవుతుంది. ఇటీవల భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంటల వివరాలను సర్కారుకు నివేదించాం.
- పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి, ఖమ్మం

### పొంచి ఉన్న 'ఈశాన్య' ముప్పు

ఇప్పటికే నైరుతి రుతుపవనాలు రైతులకు వేదన మిగిల్చాయి. ముందుముందు ఈశాన్య రుతుపవనాలు ఏమేరకు పంటలను నష్టపరుస్తాయే మోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది పంటలు చేతికందే సమయం (డిసెంబర్)లో సంభవించిన మిగ్‌జాం తుపాను వల్ల ఖమ్మం జిల్లాలో 82,211, భద్రాద్రి జిల్లాలో 13,608 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. ఇందుకు సంబంధించిన పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో యాసంగి సాగుపై తీవ్ర ప్రభావం పడినట్లు అన్నదాతలు చెబుతున్నారు.

### ఏళ్ల తరబడి నిరీక్షణ..

కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలుచేసేందుకు గతంలో భారాస సర్కారు విముఖత చూపింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉండగా.. రైతుల వాటాగా 20 శాతం చెల్లింపు విధానం అమల్లో ఉంది. భారాస సర్కారు 40శాతం వాటా చెల్లించటానికి నిరాకరించటంతో బీమాపథకం అమలు కాలేదు. రైతులపై ఆర్థిక భారం పడకుండానే పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. అయితే ఫసల్‌బీమా పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలు వెలువడలేదు. పంటల బీమా పథకం అమలుకు ఈఏడాది సైతం రైతులు నిరీక్షించాల్సిందే.

## చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ


పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థినులు ఆడిపాడారు.
– పాల్వంచ, న్యూస్‌టుడే

## విద్యుత్తు ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

పాల్వంచ, న్యూస్‌టుడే: విద్యుత్తు ఉద్యోగుల సంక్షేమం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104)తోనే సాధ్యమని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సాయిబాబా అన్నారు. పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో ఆర్టిజన్ల చైతన్య సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ విద్యుత్తు రంగ ప్రైవేటీకరణ కుట్రను ఉద్యోగులు తిప్పికొట్టాలన్నారు. ఆర్టిజన్ల 25 డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు సుధీర్, గౌరవ సలహాదారులు జనార్దన్‌రెడ్డి, నాయకులు రాజేందర్, కోటేశ్వరరావు, దుర్గా అశోక్, యాసయ్య పాల్గొన్నారు.


సమావేశమైన '1104' సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సాయిబాబా తదితరులు

## విద్యుత్తు కర్మాగారాన్ని జెన్కో నిర్మించాలి

పాల్వంచ, న్యూస్‌టుడే: రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్కేంద్రాన్ని టీఎస్ జెన్కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని పాల్వంచ కేటీపీఎస్ విద్యుత్కేంద్రం వద్ద తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. నిర్మాణ పనులను ప్రభుత్వం సింగరేణికి అప్పగించొద్దని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు సాయిబాబా, వజీర్, మంగీలాల్, సుధీర్, బ్రహ్మాజీ, మహేశ్, గిరిధర్, రాజేందర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీపై కోటి ఆశలు..!

ఈటీవీ, ఖమ్మం: రాష్ట్రంలో మరో రెండు ట్రిపుల్ ఐటీ కళాశాలలను నెలకొల్పాలని సర్కారు యోచిస్తోంది. మరోవైపు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాంకేతిక విశ్వవిద్యాలయం కొలువుదీరాలని వేలాది మంది విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏజెన్సీ జిల్లాగా పేరొందిన ప్రాంతంలో సంప్రదాయ ఇంజినీరింగ్ కోర్సులతో పాటు మరికొన్ని కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తే నిరుపేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు పడనున్నాయి.



### ఎదురుచూస్తున్న విద్యార్థి లోకం

బాసరలోని రాజీవ్‌గాంధీ సాంకేతిక, వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ)కి అనుబంధంగా మరో రెండు కొత్త ప్రాంగణాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచే ఒక్కటైనా అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. సంప్రదాయ ఇంజినీరింగ్ కోర్సులతోపాటు అదనంగా బయోటెక్నాలజీ, ఫార్మా టెక్నాలజీ వంటి ఇంజినీరింగ్, బయో సైన్స్ సమ్మేళనంతో కూడిన మల్టీ డిసిప్లినరీ కోర్సులను అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటికే ఉత్తర తెలంగాణలో ట్రిపుల్ ఐటీ కళాశాల ఉన్నందున ఈసారి దక్షిణ తెలంగాణలో ఏర్పాటుచేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పేరు ప్రధానంగా తెరపైకి వస్తుండటంతో ఇక్కడి విద్యార్థి లోకం కోటి ఆశలతో ట్రిపుల్ ఐటీ కోసం ఎదురుచూస్తోంది.

### మంత్రులు దృష్టి సారిస్తే..

ఇప్పటికే ఖమ్మం మినహా మిగతా ఉమ్మడి జిల్లాల్లో విశ్వవిద్యాలయాలు కొలువుదీరాయి. ఖమ్మం జిల్లాలో విశ్వవిద్యాలయం నెలకొల్పాలని విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. రాజకీయ పరంగానూ ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. గడిచిన శాసనసభ ఎన్నికల్లో హస్తం పార్టీకి అత్యధిక అసెంబ్లీ స్థానాలు కట్టబెట్టింది. గతంలో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజలు ఏమి కోరినా కాంగ్రెస్ ప్రభుత్వం కాదనబోదని హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో ట్రిపుల్‌ఐటీ కళాశాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నెలకొల్పేలా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పట్టుబట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

### కొలువుదీరితే ఉమ్మడి జిల్లాకు మహర్దశే

హైదరాబాద్ తర్వాత విద్యాహబ్‌గా విరాజిల్లుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు ఆస్థాయిలో విద్యాసంస్థలు కొలువుదీరలేదన్న నిరాశ విద్యార్థి లోకాన్ని వెంటాడుతోంది. ఖమ్మం జిల్లాలో 1,211, భద్రాద్రి జిల్లాలో 1,299 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలున్నాయి. ఏటా దాదాపు 35 వేల మంది విద్యార్థులు పదోతరగతి పూర్తిచేసుకుంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ట్రిపుల్ ఐటీ కళాశాల నెలకొల్పితే విద్యాపరంగా అద్భుతమైన ప్రగతి సాధించే అవకాశాలు ఉన్నాయి. ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటైతే ఇంటర్ రెండేళ్లు, బీటెక్ నాలుగేళ్లు మొత్తం ఆరేళ్ల కోర్సు అందుబాటులోకి రానుంది. ఫలితంగా వేలాది మంది ఏజెన్సీ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందనుంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి బాసర దూరంగా ఉండటం, ట్రిపుల్ ఐటీ కోర్సులపై పెద్దగా అవగాహన లేకపోవటంతో ఇప్పటివరకు ఉభయ జిల్లాల నుంచి విద్యార్థుల ప్రాతినిధ్యం సరైన స్థాయిలో లేదు. ఎక్కువ మంది పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యాభ్యాసం వైపు మొగ్గుచూపుతున్నారు. ఒక్కసారి ట్రిపుల్ ఐటీ కళాశాలలో చేరితే విద్యార్థి ఇంజినీర్‌గా బయటకు వచ్చే అవకాశముంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

## 1,015 మంది ధ్రువపత్రాల పరిశీలన పూర్తి


ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: 'డీఎస్సీ-2024' నియామక ప్రక్రియలో భాగంగా 1:3 పద్ధతిలో ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థుల వివరాల జాబితాను ఆన్‌లైన్ చేస్తున్నట్లు డీఈఓ ముమ్మడి వెంకటేశ్వరాచారి తెలిపారు. కొత్తగూడెం పట్టణం సింగరేణి కాలరీస్ హైస్కూల్‌లో 852 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను శుక్రవారం పరిశీలించారు. ఇప్పటివరకు మొత్తం 447 పోస్టులకు సంబంధించి 1,015 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. శనివారం చివరి రోజు మరో 163 మంది అభ్యర్థుల పత్రాలను పరిశీలించనున్నారు.



## సీనియర్ సివిల్ జడ్జి జి.భానుమతి బదిలీ

**న్యాయమూర్తి బి.రామారావుకు బాధ్యతలు**

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: మూడు సంవత్సరాలుగా కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న జి.భానుమతి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో పూర్తి అదనపు ఇన్‌ఛార్జి న్యాయమూర్తిగా బత్తుల రామారావును నియమించారు. ఈయన ప్రస్తుతం జూనియర్ సివిల్ జడ్జిగా కొత్తగూడెంలో పనిచేస్తూ ఇటీవల సీనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగోన్నతి పొందారు. బదిలీపై వెళ్లిన జి.భానుమతికి ఇంకా పోస్టింగ్ కేటాయించలేదు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ విజిలెన్స్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఇద్దరు న్యాయమూర్తులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

☆ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు ఏపీపీగా కారం రాజారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఆయన ఖమ్మం ఏపీపీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై కొత్తగూడెం బదిలీ అయ్యారు. ఇదే కోర్టులో ఇప్పటి వరకు పనిచేసిన పీవీడీ లక్ష్మి ఒకటో అదనపు జిల్లా కోర్టుకు ఉద్యోగోన్నతిపై వెళ్లారు.

## వినియోగదారుల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: వినియోగదారుల ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్-1 (వరంగల్) ఛైర్మన్ ఎస్.వి.వేణుగోపాలాచారి అధికారులను ఆదేశించారు. ఇల్లెందు విద్యుత్ సంస్థ కార్యాలయంలో వినియోగదారుల సమస్య పరిష్కార వేదికను శుక్రవారం నిర్వహించారు. టెక్నికల్ సభ్యులు కె.రమేష్, ఆర్.చరణ్‌దాస్‌తో కలిసి వేణుగోపాలాచారి వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఓర్పుగా వ్యవహరిస్తూ, రక్షణ చర్యలు పాటిస్తూ సేవలు అందించాలన్నారు. ఎస్ఈ మహేందర్, ఎస్ఏఓ మురళీ, డీఈ రంగస్వామి, ఏఈలు రవి, రాము, రమేష్ పాల్గొన్నారు.


వేదికపై విద్యుత్ సంస్థ అధికారులు రమేష్, వేణుగోపాలచారి(ఛైర్మన్), చరణ్‌దాస్

## ఏరియా క్రీడా పోటీల సందడి



కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కార్పొరేట్, కొత్తగూడెం ఏరియా స్థాయి కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రకాశం మైదానంలో శుక్రవారం జరిగాయి. డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్ పోటీలను ప్రారంభించారు. బాల్‌బ్యాడ్మింటన్‌లో కొత్తగూడెం ఏరియా జట్టుపై కార్పొరేట్ ఏరియా జట్టు, కబడ్డీలో కార్పొరేట్ జట్టుపై కొత్తగూడెం ఏరియా జట్టు గెలిచాయి. ఏఐటీయూసీ నాయకుడు రమణమూర్తి, ఐఎన్‌టీయూసీ నాయకుడు పీతాంబరరావు, క్రీడా పర్యవేక్షకుడు పాస్‌నెట్, క్రీడా సమన్వయకర్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొలువుల కోటీశ్వరుడు..

◆ నాలుగు ఉద్యోగాలు సాధించిన యువకుడు



కోటేశ్వరరావు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే

కొందరు ఆర్థికంగా స్థితిపరులై ఉంటారు. ఇంకొందరు బాగా చదువుకుని జ్ఞాన సంపద పెంచుకుంటారు. ఇలాంటి వారు తమ లక్ష్య సాధన క్రమంలో మధ్యలోనే విజయ ఫలాలు దక్కినా గమ్యం చేరేవరకూ విశ్రమించరు. ఆ కోవలోకి చెందిన వ్యక్తే ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రాజులదేవరపాడుకు చెందిన కోమటి కోటేశ్వరరావు.

రాజులదేవరపాడుకు చెందిన రైతు పుల్లయ్య, లక్ష్మీల చిన్న కుమారుడు కోటేశ్వరరావు. పదో తరగతి వరకు మామునూరు ఉన్నత పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ మధిరలో చదువుకున్నాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు కళాశాలలో టీటీసీ పూర్తి చేశారు. టీటీసీ అభ్యసిస్తున్న సమయంలోనే ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలన్న పట్టుదల పెరిగింది. ఈ క్రమంలో కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్ రావటంతో దానికి ప్రిపేరయ్యారు. 2016లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. పోలీసు శిక్షణలో ఉన్నప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైనా పోస్టులు లేకపోవటంతో నిరుత్సాహానికి గురయ్యారు. అనంతరం 2018లో సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యారు. అందులో చేరకుండా ఏఆర్‌లోనే కొనసాగుతూ 2023 జులైలో గ్రూప్-4 పరీక్ష రాశారు. రెండు నెలల క్రితం వచ్చిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 62వ ర్యాంక్ దక్కించుకున్నారు. తన లక్ష్యం ఉపాధ్యాయ కొలువు. రెండు నెలలపాటు సెలవు పెట్టి 2024 డీఎస్సీకి సిద్ధమయ్యారు. తాజా ఫలితాల్లో ఎస్జీటీలో జిల్లా స్థాయిలో 19వ ర్యాంక్ సాధించారు.

‘ఏ ప్రవేశ పరీక్షకూ శిక్షణ తీసుకోలేదు. అకాడమీ పుస్తకాలతో సొంతంగా పరీక్షలకు సిద్ధమయ్యా. ప్రస్తుతం కొత్తగూడెం స్పెషల్ పార్టీలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నా. సెలవుపెట్టి డీఎస్సీకి సిద్ధమయ్యా. ఉపాధ్యాయుడిగా వృత్తిలోకి రాబోతుండటం సంతోషంగా ఉంది. - కోటేశ్వరరావు

# ఆయన పేరే ‘దయ’.. మానవతలో సాటి లేరయా!!

గురువుంటే అక్షర జ్ఞానాన్నివ్వడమే కాదు.. విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవడం

విధులంటే వేళలకే పరిమితమవడం కాదు.. పరిధి మించి బడి అభివృద్ధికి పూనుకోవడం

ఉద్యోగం అంటే ఓ కర్తవ్యమే కాదు.. అభాగ్యులకు, సమాజానికి చేతనైన సాయమందించడం

ఈ ఆలోచనలను ఆచరణలో పెట్టడం వల్లే ఆ గురువుకు దరఖాస్తుతో నిమిత్తం లేకుండా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఆయన పేరులోనే ‘దయ’ ఉండటం కాదు.. చేసే ప్రతిపనిని అదే గుణంతో కొనసాగిస్తుంటారు.

పాల్వంచ, న్యూస్‌టుడే



విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ప్రభుదయాళ్

కొత్తగూడెం పట్టణం రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి (ఎంఈఓ) డా. మారుముడి ప్రభుదయాళ్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించారు. ‘నేడు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం’ సందర్భంగా ఆయనపై ప్రత్యేక కథనం.

ఏపీపీఎస్సీ గ్రేడ్-2 క్యాడర్‌లో ఉపాధ్యాయ వృత్తి ఆరంభించారు ప్రభు దయాళ్. తొలి పోస్టింగ్ 1993లో.. టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దక్కింది. అక్కడ 2000 సంవత్సరం వరకు ఎంఈఓ, ఎంపీడీఓ, స్పెషల్ ఆఫీసర్ హోదాల్లో విధులు నిర్వహించారు. 2004-2011 వరకు భద్రాచలం ఐటీడీఏ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ఏటా ఉత్తమ ఫలితాలు సాధించి జాతీయ ఉపాధ్యాయ మండలి నుంచి దిల్లీ స్థాయిలో అవార్డు అందుకున్నారు. 2011-18 వరకు కొత్తగూడెం పట్టణం మేదరబస్తీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించారు. ఏటా పలువురు విద్యార్థులు బాసర ఐఐటీలో ప్రవేశాలు పొందేలా తీర్చిదిద్దేందుకు కృషిచేశారు. ఆ తర్వాత ఖమ్మం జిల్లాలోని మధిర ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అక్కడ 2018-2023 వరకు పనిచేసి.. గతేడాది తిరిగి కొత్తగూడెం రామవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వచ్చారు. ఆ తర్వాత నోడల్ అధికారిగా వ్యవహరిస్తూనే తాజాగా ఎంఈఓ బాధ్యతలు చేపట్టడం విశేషం. సెలవులతో నిమిత్తం లేకుండా అందుబాటులో ఉండటం ప్రభుదయాళ్ ప్రత్యేకత. పనివేళలు లేని రోజుల్లోనూ బడికి వెళ్లడం, ఆవరణ శుభ్రం చేయడం, చెట్లను నాటడం వంటి వ్యాపకాలు కొనసాగిస్తుంటారు. పనిచేసే ప్రతిచోట విద్యార్థులను దత్తత తీసుకుంటారు. పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించడంతో పాటు ఆరోగ్యపరంగా ఇబ్బందులు వస్తే ఆయనే ప్రథమ చికిత్స అందిస్తారు. అవసరమనుకుంటే ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తారు. ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్లు ఏర్పాటు చేయించారు. వాటిని నిత్యం పిల్లలతో నింపిస్తూ జీవరాశులపై దయ కనబరుస్తున్నారు. అనాథలు, యాచకులకు తనవంతు సాయం చేస్తున్నారు. పేద విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తారు. ఇటీవల రాష్ట్ర ఉపాధ్యాయ ప్రత్యేక అవార్డు స్వీకరణ సందర్భంగానూ.. రాష్ట్ర వరద ముంపు బాధితులకు తనవంతుగా రూ.10 వేల సాయాన్ని ప్రకటించి ప్రభుత్వం నుంచి అభినందనలు అందుకున్నారు. ఇంటిని చక్కదిద్దుకున్నట్లు పనిచేసే బడినీ గుడిలా చూసుకోవాలంటారాయన.

“విద్యాలయాల్ని దేవాలయంగా భావిస్తా. రోజూ పాఠశాల సమయానికే చేరుకోవడం, నా వంతుగా ఆ రోజు ఏం చేయాలో ఆలోచించి దాన్ని ఆచరణలో పెట్టడం చేస్తా. నా సేవల్ని గుర్తించి పలువురు ఐఏఎస్ అధికారులు, రాష్ట్ర, జాతీయ స్థాయి సంస్థలు, ప్రభుత్వాలు ఇచ్చిన అవార్డులు, పతకాలు ఎంతో సంతృప్తిని కలిగిస్థాయి.”

- ప్రభుదయాళ్, ప్రధానోపాధ్యాయుడు



## ద్వీపం.. ప్రకృతి అందాల శోభితం

ఆహ్లాద వాతావరణంలో పాల్వంచ కిన్నెరసాని పర్యాటకులను అలరిస్తోంది. చుట్టూ పచ్చందాల హొయలు, వన్యప్రాణుల సందళ్లు, జలాశయంలో బోటు విహారాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. దసరా సెలవులు నేపథ్యంలో గత రెండ్రోజులుగా పర్యాటకుల సంఖ్య రెట్టింపైంది. జలాశయం మధ్యనున్న ద్వీపం వంతెన మీదుగా ఇలా అద్భుతంగా కనిపిస్తుండటంతో సందర్శకులు సెల్ఫీలు దిగేందుకు పోటీపడుతున్నారు.

– పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే



## సింగరేణిలో బతుకమ్మ సంబరాలు

అమెరికా, జపాన్ పర్యటనను ముగించుకుని శుక్రవారం తిరిగొచ్చిన సింగరేణి సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం సాయంత్రం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. రాత్రి జరిగిన బతుకమ్మ వేడుకల్లో సీఎండీ, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు అధికారులు బహుమతులను అందించారు. పర్యటన విజయవంతంగా ముగించిన సీఎండీని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, యూనియన్ నాయకులు సన్మానించారు.

– కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే



## కనువిందు చేస్తున్న పులిగుండాల

చుట్టూ కొండలు, దట్టమైన అరణ్యాలు మధ్యలో సరస్సు. సహజసిద్ధంగా ఏర్పడిన ‘పులిగుండాల’ ప్రాజెక్టు అందాలు వీక్షకులకు కనువిందు చేస్తున్నాయి. పెనుబల్లి మండలం బ్రహ్మాలకుంట అటవీ ప్రాంతంలోని ఈ ప్రాజెక్టు ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకర్షిస్తోంది. నిత్యం జలంతో కళకళలాడటం దీని ప్రత్యేకత. తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. తెలంగాణ ప్రభుత్వం దీనిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది.

– ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

## 12న అశ్వారావుపేటలో రైతు సదస్సు

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో ఆయిల్‌పాం రైతులతో ఈనెల 12న సదస్సు నిర్వహించనున్నట్లు టీజీ ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకరరెడ్డి తెలిపారు. అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమ ఆవరణలో రూ.36కోట్లతో నిర్మించిన విద్యుత్తు ప్లాంటు(టర్బైన్)ను అదేరోజు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అశ్వారావుపేట, అప్పారావుపేటలోని పామాయిల్ పరిశ్రమలను ఆయిల్‌ఫెడ్ విస్తరణ, ప్రాజెక్టుల జనరల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా డీఓ బాలకృష్ణ, అశ్వారావుపేట, అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమల మేనేజర్లు కల్యాణ్, నాగబాబుతో కలిసి శుక్రవారం సందర్శించారు. పామాయిల్ పరిశ్రమకు నిరంతరం విద్యుత్తు అందించేందుకు వీలుగా, వచ్చే ఏడాది నూతన పరిశ్రమ నిర్మాణానికి ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఏపీ నుంచి అధికసంఖ్యలో రానున్న రైతులతో సదస్సు ఏర్పాటు చేయనున్నామని, జయప్రదం చేయాలని కోరారు. ఈ ఏడాది దసరా కానుకగా రైతులకు అత్యధిక ధర రూ.17,043 దక్కేందుకు కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సదస్సుకు హాజరుకానున్నారని వివరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు బండి భాస్కర్ ఉన్నారు.

# మన్యంలో వైద్యసేవల మెరుగుకు చర్యలు: పీఓ రాహుల్

చర్ల, న్యూస్‌టుడే: మన్యంలో మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. చర్లలోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం సందర్శించారు. స్థానిక మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి సౌకర్యాలపై వైద్యాధికారి సాయివర్ధన్‌ను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాష్ట్రంలోని నాలుగు ఐటీడీఏల పరిధిలో అందుతున్న వైద్యసేవలపై సమీక్షించి తగిన సూచనలు చేశారన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఆ మేరకు రానున్న రోజుల్లో మెరుగైన వైద్యసేవలు అందేలా ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. చర్ల, ఇల్లెందు, గార్ల సీహెచ్‌సీలకు కొద్ది రోజుల్లో వైద్యులు, సిబ్బందిని భర్తీ చేస్తామని పీఓ తెలిపారు. గతంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఖమ్మంలో



చర్ల ఆసుపత్రిలో సేవలపై ఆరా తీస్తున్న పీఓ రాహుల్

ఉండటంతో కొన్ని ఇబ్బందులు తలెత్తేవని, వాటిని అధిగమించేందుకు కొత్తగూడెంలో డ్రగ్ స్టోర్ ఏర్పాటు కానుందన్నారు. భద్రాచలంలో సైతం మినీ డ్రగ్ స్టోర్ ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. మారుమూల పీహెచ్‌సీల నుంచి రక్తనమూనాలను కొత్తగూడెం టీహబ్‌కు పంపడంలో ఇబ్బందులు ఎదురవుతుండటంతో కొత్తగా భద్రాచలం ఐటీడీఏకు డయోగ్నోస్టిక్ ల్యాబ్, సీటీస్కాన్ యంత్రం ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.

**విద్యాలయాల్లో పనులు వెంటనే పూర్తి చేయండి**

భద్రాచలం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోని విద్యాలయాల్లో నిర్మాణ దశలో ఉన్న పనులను ఈనెల 14లోపు పూర్తిచేయాలని ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశించారు. తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యాలయాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్లోరింగ్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. దసరా సెలవుల తర్వాత వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈఈ తానాజీ, డీఈలు పాల్గొన్నారు.

## రూ.6.80 కోట్ల గంజాయి దహనం



గంజాయిని దహనం చేస్తున్న ఆబ్కారీ ఉన్నతాధికారులు, సిబ్బంది

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: వివిధ కేసుల్లో పట్టుబడిన రూ.4 కోట్ల గంజాయిని ఖమ్మం జిల్లాలో దహనం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వారావుపేట, మణుగూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల గంజాయి రవాణా కేసులు 22 నమోదయ్యాయి. ఆయా ఘటనల్లో ఆబ్కారీ శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్, రాష్ట్ర, జిల్లా ప్రత్యేక బృందాలు 1065.13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒక్క పాల్వంచ ఎక్సైజ్ పరిధిలోనే ఏకంగా 1036.43 కిలోల సరకు పట్టుబడింది. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్సుమెంట్ వీబీ కమలాసన్ రెడ్డి ఆదేశాలతో రూ.4 కోట్ల విలువైన గంజాయిని ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేటలోని రాష్ట్ర అధీకృత అడ్వాన్స్‌డ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రంలో శుక్రవారం దహనం చేశారు. ఆబ్కారీ ఎన్‌ఫోర్సుమెంట్ ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ జి.గణేశ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 1 కూడా ఖమ్మం జిల్లాలో ఆబ్కారీ అధికారులు మరో రూ.2.80 కోట్ల విలువైన 1,120 కిలోల గంజాయిని కాల్చి బూడిద చేశారు. ఈ రెండు ఘటనల్లో దహనం చేసిన గంజాయి విలువ సుమారు రూ. 6.80 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

## ‘కథ-2023’ పుస్తకావిష్కరణ 6న

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ‘కథ-2023’ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఖమ్మం జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించనున్నారు. ‘ఆంధ్రజ్యోతి’ సంపాదకుడు కె.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రముఖ కవి పి.రవిమారుత్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా కె.శివారెడ్డి, మువ్వా శ్రీనివాసరావు, కథాసాహితీ సంపాదకులు వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ హాజరవుతారు. పుస్తకాన్ని పి.జ్యోతి సమీక్షించనున్నారు. కవులు, రచయితలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# స్వర్ణ రూపంలో రాములోరి దర్శనం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు కొనసాగించారు. స్వర్ణ కవచాలంకారంలో దేవదేవుడు మెరిసిపోవడంతో వీక్షించిన భక్తులు మురిసిపోయారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించారు. క్షేత్రవిశిష్టతను ప్రవచించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ కొనసాగించారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక అమితానందాన్ని అందించాయి. దర్బారుసేవ తన్మయత్వాన్ని నింపింది. చిత్తా నక్షత్రం సందర్భంగా యాగశాలలో సుదర్శన హోమం చేశారు. రాములవారిని ప్రభుత్వ కార్యదర్శి సురేంద్రమోహన్ దర్శించుకున్నారు. ఆర్డీఓ దామోదర్‌రావు పాల్గొన్నారు.



పూజ చేసి మైకు ప్రచారాన్ని ప్రారంభిస్తున్న ఈఓ రమాదేవి

**ప్రచార మైకులు ప్రారంభం..:** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో భక్తి ప్రచార మైకులను ఈఓ రమాదేవి పూజచేసి ప్రారంభించారు. దాతలు రూ.4 లక్షలు అందించగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో మైకులను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన వ్యవస్థను ఆలయం వద్ద నెలకొల్పారు. నిత్యం కోవెలలో ఉదయం నుంచి రాత్రివరకు నిర్వహించే పూజలు, హోమాలు, ఉత్సవాల ప్రవచనాలను మైకుల ద్వారా ప్రసారం చేయనున్నారు.

# మున్నేరులో రసాయన వ్యర్థాలను కలిపే యత్నం



రసాయన వ్యర్థాలు పోసేందుకు వచ్చిన ట్యాంకర్

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్ పరిధిలోని పలు రసాయన పరిశ్రమల నుంచి సేకరించిన వ్యర్థాలను లారీ ట్యాంకర్‌లో తీసుకొచ్చి మున్నేరులో కలుపుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున గుదిమళ్ల పంచాయతీ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. మున్నేరులో వ్యర్థాలను పోసేందుకు ఓ ట్యాంకర్ రాగా దాన్ని స్థానికులు అనుసరించారు. పశువులు, జీవాలు కలుషిత నీటిని తాగి అనారోగ్యం పాలవుతున్నాయని, చేపలు కూడా చనిపోతున్నాయన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్యాంకర్‌ను ఠాణాకు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయగా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఇలా రసాయన వ్యర్థాలతో వచ్చిన వాహనాన్ని పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే వెంటనే వదిలేశారని, అవే ట్యాంకర్లు మళ్లీ వస్తున్నాయని ఆరోపించారు. కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లాలని పట్టుబట్టారు. చివరకు ట్యాంకర్‌ను ఠాణాకు తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన లారీ డ్రైవర్ కృష్ణ, యజమాని మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. ఇదే విషయంపై రెండు నెలల క్రితం కూడా కేసు నమోదైనట్లు చెప్పారు.

## ఆర్థిక ఇబ్బందులతో మహిళ బలవన్మరణం

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని లోతువాగు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎజ్జు రమేశ్, లక్ష్మి(33) భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు. దంపతులిద్దరూ కూలి పనులు చేసుకొంటూ కుటుంబాన్ని పోషించుకొంటున్నారు. ఇంటి అవసరాల రీత్యా కొన్నాళ్ల క్రితం మైక్రో ఫైనాన్స్ సంస్థల్లో అప్పులు తీసుకొన్నారు. వాటిని తీర్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మి ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

**చికెన్ ధరలు**

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120
రిటైల్ ధర 142
చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.



**ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)**

| పంట పేరు | కనిష్ఠ | గరిష్ఠ | నమూనా |
|---|---|---|---|
| కొత్తపత్తి | 4,500 | 7,111 | 6,500 |
| పాతపత్తి | 4,500 | 7,550 | 6,000 |
| పెసలు | 4,000 | 7,250 | 7,025 |
| ఏసీ ఎండుమిరప | 10,000 | 20,000 | 17,200 |
| ఎండుమిరప | 9,000 | 18,000 | 17,500 |
| ఏసీ తాలుమిరప | 9,000 | 11,000 | 10,000 |
| తాలుమిరప | 6,000 | 9,700 | 9,500 |

# సమస్యల వలయంలో ‘పటేల్’ మైదానం..!

ఖమ్మంలో సర్దార్ పటేల్ మైదానం సమస్యల వలయంలో చిక్కుకుంది. గుంపులు గుంపులుగా శునకాలు సంచరిస్తుండటంతో నడకదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు కూర్చునే స్థలంలో పోల్స్ విరిగిపోయాయి. వాటర్ కూలర్ నిరుపయోగంగా మారింది. మైదానం ఆవరణలో స్తంభానికి కర్ర కట్టి వేలాడదీసిన విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఓపెన్ జిమ్ పరికరాలు కొన్ని మాత్రమే పనిచేస్తున్నాయి. అక్కడక్కడ పారిశుద్ధ్యం లోపించింది. ఈ అంశాలపై డీఎస్‌డీఓ సునీల్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. కొన్ని పరికరాలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. మైదానంలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని చెప్పారు. – ఈనాడు, ఖమ్మం



నడకదారుల మధ్య శునకాల విహారం



క్రీడాకారులు, క్రీడాభిమానులు కూర్చునే స్థలంలో విరిగిన పోల్స్

# భద్రాచలం

•భద్రాచలం •పినపాక •అశ్వారావుపేట

## 'పారదర్శకంగానే ఈపీ ఆపరేటర్లకు ముఖాముఖి'

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సంస్థ నియమ, నిబంధనలకు అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగానే ఈపీ ఆపరేటర్లకు ముఖాముఖి నిర్వహించామని ఏరియా ఎస్టేటు జీఎం శ్యాంసుందర్ అన్నారు. మణుగూరులోని పీకేఓసీ-2 బేస్ వర్క్‌షాప్‌లో శుక్రవారం అంతర్గత డీ-గ్రేడ్ ఆపరేటర్లకు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ జీఎం మాట్లాడుతూ... ముఖాముఖిలో ఉత్తీర్ణత సాధించిన ఆపరేటర్లకు పదోన్నతి కల్పిస్తూ ఖాళీల అవకాశాన్ని బట్టి సీ-గ్రేడ్ ఆపరేటర్లుగా నియమిస్తామన్నారు. మొత్తం 18 మందికి ముఖాముఖిలో పాల్గొన్నారని, ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు త్వరలో సమాచారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రమేష్, అధికారులు వీరభద్రుడు, సుదర్శన్, ప్రవీణ్, శ్రీకృష్ణ, వెంకటేశ్వర్లు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు సకాలంలో వైద్యసేవలు అందాలి: కలెక్టర్



సిబ్బందితో మాట్లాడి రోగుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఆసుపత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం అందించడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. అశ్వారావుపేట సామాజిక ఆసుపత్రి, వ్యవసాయ కళాశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్స గదిలో ఉపయోగపడని సామగ్రి ఎందుకు ఉంచుతున్నారు? వాటిని పనికిరాని వాటికింద నమోదుచేసి ఎందుకు తీసేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనివల్ల ఇరుకుగా మారడమేగాక ఇతర వ్యాధులకు కారకాలవుతాయన్నారు. జిల్లాలో మిగిలిన సీహెచ్‌సీల్లో సౌకర్యాలు కావాలని లేఖలు రావడంతో వారికి మంజూరు ఇచ్చాము... మీ నుంచి ఇంతవరకూ ఒక్క లేఖా రాలేదు అన్నారు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్స, ప్రసవాల గది, ఐసీయూ, రోగుల నిరీక్షణ గది, మందుల గదులు, రక్తపరీక్షా కేంద్రం తదితరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో విద్యుత్తు వైరింగ్, పైకప్పు లీకేజీ, రోగులు నిరీక్షణ కావాల్సిన షెడ్, ఆర్ ఎసీమీ అవసరాలు ఉంటాయని వాటిని కలెక్టర్ స్వయంగా రాసుకోవడం విశేషం. ఆయనకు వైద్యాధికారి రుక్మిణి, విజయకుమార్ వివరాలు తెలిపారు. అనంతరం కలెక్టర్ స్థానిక వ్యవసాయ కళాశాలలో ఆచార్యులు, విద్యార్థులతో వేర్వేరుగా మాట్లాడారు. ఏడాదికి రూ.6నుంచి రూ.7లక్షలు సంపాదిస్తున్న ఏకైక అంతే స్థాయిలో రైతులకు కళాశాల సేవలు అందిస్తున్నారా అని ప్రశ్నించారు. రైతులకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచార్యులు అందించాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో పెంచుతున్న కొబ్బరిని అల్లం, పసుపు, చామ, వక్క, కోకో, అరటి తోటలను పరిశీలించారు. ఆచార్యులు రైతుల శ్రేయస్సుకు సమగ్ర కార్యాచరణతో ఆలోచించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణప్రసాదు, కళాశాల ఏడీ జే. హేమంత్‌కుమార్, ఇతర ఆచార్యులున్నారు.

## గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సెక్యూరిటీ గార్డుల నియామకంలో అక్రమాలకు పాల్పడుతున్న గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ. సింగరేణి సెక్యూరిటీకి అనుబంధంగా పనిచేస్తున్న మురళీ మ్యాన్ పవర్ ఏజెన్సీ నిర్వాహకులు నియామకాల విషయంలో తీవ్రస్థాయిలో అవినీతి చేస్తున్నారన్నారు. ఈ విషయంలో నగదు కూడా భారీగా చేతులు మారుతుందని, యాజమాన్యం కచ్చితంగా స్పందించాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు సురేందర్, కుమారస్వామి, కృష్ణంరాజు, గట్టయ్య, కిషన్, వెంకటరత్నం, శ్రీలత, నాసర్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాన్ని.. కాపాడుకుంటేనే..!

### మురుగు నీటిని శుద్ధిచేసే ప్లాంట్ అవసరం

భద్రాచలం, భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

గంగానది ప్రక్షాళన తరహాలో దక్షిణ గంగగా పేరుగాంచిన గోదావరి శుద్ధి చేసేందుకు రెండు దశాబ్దాల కిందట అమలైన కాలుష్య నివారణ పథకం మళ్లీ తెరపైకి వచ్చింది. ఐదైదే ఏళ్ల క్రితం చక్కగా పనిచేసిన ఈ విధానం శాఖల మధ్య సమన్వయ లోపంతో మూలన పడింది. ప్రస్తుతం చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పులతో పాటు చినుకు పడిందంటే లోతట్టు కాలనీలకు ముంపు తప్పడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మళ్లీ కాలుష్య నివారణ పథకాన్ని అమలు చేసేందుకు అధికారులు ప్రణాళికలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోదావరి వరదలను సమీక్షించేందుకు ఇటీవల భద్రాచలాన్ని సందర్శించిన సందర్భంలోనూ దీనిపై దృష్టి సారించడంతో అధికారుల్లో చలనం మొదలైంది.



నిరుపయోగంగా మారిన కాలుష్య నివారణ పథకం

### పథకం ఉద్దేశం ఇదీ..

నాసికా త్రయంబకంలో పుట్టిన గోదావరి బంగాళాఖాతంలో కలిసేవరకు సుదీర్ఘ ప్రయాణం సాగిస్తుంది. నదీ తీరంలో వందల సంఖ్యలో కర్మాగారాలు, వ్యాపార కేంద్రాలు, నివాస సముదాయాలు ఉండటంతో వ్యర్థ జలాలు నేరుగా మురుగు కాల్వల ద్వారా గోదావరిలో కలుస్తున్నాయి. ఇదే నది నీటిని తాగునీటి పథకాల ద్వారా సరఫరా చేసి జనం దాహార్తిని తీర్చుతున్నారు. ఈ నీటిని తాగడానికి ఇతర అవసరాలకు ఉపయోగించడంతో ఆరోగ్యానికి ముప్పు పొంచిఉంది. ఈ సమస్యని గుర్తించిన అధికారులు మురుగు నీటి శుద్ధికి కార్యాచరణ చేపట్టి రాజమండ్రి, మంచిర్యాల, భద్రాచలంలో రూ.8 కోట్లతో కాలుష్య నివారణ పథకాలు 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు.

**భద్రాచలంలో ఇలా..** భద్రాచలం పట్టణంలో మురుగునీరు నేరుగా గోదావరిలో కలవకుండా ఉండేదుకు రూ. 2 కోట్లతో ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. కాలనీల నుంచి వ్యర్థ జలమంతా విస్తా కాంప్లెక్స్ చేరుకున్న తర్వాత అక్కడ పెద్ద బావిలో మోటార్ల ద్వారా రివర్స్ పంపింగ్ ఉండేది. ఈ నీరు సుమారు 3 కి.మీ. దూరంలోని మనుబోతుల చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌కు వెళ్లేది. అక్కడ నిపుణులైన పనివారు ఫిల్టర్ బెడ్‌లో మోటార్ల సాయంతో మరో కొలనులోకి నీటిని పంపించి చెత్త చెదారాన్ని వేరు చేసేవారు. దానిని పట్టణ శివారులోని చప్టాగుండా గోదావరిలో కలిపారు. ప్రజారోగ్య శాఖ, విద్యుత్తు విభాగం, గ్రామ పంచాయతీల మధ్య సమన్వయం లోపించడంతో కొద్దికాలానికే ఇది మూతపడింది. విద్యుత్ బిల్లులు పేరుకుపోవడంతో ఆ తర్వాత దీని ఊసే ఎత్తలేదు. ఇందులో పనిచేసే సిబ్బంది తలోదారి చూసుకున్నారు.

**ఇప్పటికైనా దృష్టి సారిస్తే..** కాలుష్య నివారణ పథకం ఉపయోగంలోకి వస్తే భద్రాచలంలో మురుగు కాలువలను విస్తరించడంతోపాటు, వీటిపై ఆక్రమణలు తొలగించాలి. డ్రైనేజీ నీరు నేరుగా గోదావరిలో కలవకుండా రివర్స్ పంపింగ్ ద్వారా ఆదర్శనగర్ కాలనీలోని గ్రామ పంచాయతీ నూతన డంపింగ్ యార్డుకు తరలించాలి. ఇలా చేస్తే రామాలయం పడమర మెట్ల, అన్నదాన సత్రానికి, విస్తా కాంప్లెక్స్ పరిసరాలకు వర్షపు నీటితో ఏర్పడే ముంపును అరికట్టవచ్చు. కాలుష్యం లేని నీటిని ప్రత్యేక కాలువ ద్వారా వాగుకు అనుసంధానం చేసి గోదావరిలో కలపవచ్చు. ఇందుకు శాఖల మధ్య సమన్వయం అవసరం.

దీనిపై గ్రామ పంచాయతీ ఈఓ సీహెచ్ శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా మూతపడిన పథకాన్ని పరిశీలించి ప్రత్యేకాధికారి దృష్టికి సమస్యను తీసుకెళతామని వివరించారు.

## రూ.4 లక్షల ఎల్‌వోసీ అందజేత

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: తన సిఫార్సు మేరకు సీఎంఆర్ఎఫ్ నుంచి అందించిన రూ.4 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ)లను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర వ్యక్తిగత సిబ్బంది శుక్రవారం బాధితులకు అందించారు. ములకలపల్లి మండలం వేపలగడ్డకు చెందిన వై. వెంకటేశ్వర్లు, కొణిజర్ల మండలం పెద్ద గోపతి గ్రామానికి చెందిన బి. హారిక కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చొప్పున ఎల్‌వోసీలు అందించారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

**సమస్య:** లక్ష్మీనగరం సూపర్ మార్కెట్ సెంటరులో తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన గేట్ వాల్వు వద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. **- స్థానికులు**

**సమాధానం:** వెంటనే గొయ్యిని పూడ్చించేందుకు చర్యలు చేపడతాం. **- అనూష పంచాయతీ కార్యదర్శి** దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

సీతంపేట గ్రామ శివారులో ప్రధాన రహదారి పక్కనే దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. కాలినడకన పినపాక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. **- పలువురు వాహనదారులు**

✔ పరిశీలించి శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. **- పినపాక ఎంపీవో వెంకటేశ్వరరావు**

మణుగూరు మండల పరిధిలోని సీఎస్‌పీ ప్రాంతంలో ప్రమాదకర కోనాకార్పస్ మొక్కలను తొలగించలేదు. **- గ్రామస్థులు**

✔ ఆ ప్రాంతం పురపాలిక సంఘం పరిధిలోకి వస్తుంది. సంబంధిత అధికారులకు సమాచారం అందించాం. తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వరరావు ఎంపీవో మణుగూరు**

పినపాక, న్యూస్‌టుడే

## మాదారంలో అడవి జంతువుల వేట..!

ములకలపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మాదారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో వన్యమృగాల కోసం ఏర్పాటు చేసిన ఇనుప తీగెలను స్థానికులు శుక్రవారం గుర్తించారు. వేటగాళ్లు రాత్రి సమయంలో ఈ ఇనుప తీగెలకు విద్యుత్తు సరఫరా చేసి అడవి జంతువులను వేడాడుతున్నారు. గతంలో రాత్రిళ్లు పొలాలకు వెళ్లే రైతులూ ఈ తీగెలకు తగిలి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. వేటగాళ్ల అంశం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

## అక్రమంగా రవాణా అవుతున్న కలప పట్టివేత

అశ్వాపురం, న్యూస్‌టుడే: అక్రమంగా రవాణా అవుతున్న కలపను అశ్వాపురం అటవీ శాఖ అధికారులు శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పట్టుకున్నారు. ఎఫ్ఆర్ఓ ఎస్. రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరు పట్టణ ప్రధాన రోడ్డు డివైడర్లపై ఉన్న కోనోకార్పస్ చెట్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పురపాలక శాఖ అధికారులు ఇటీవల నరికివేశారు. ఆ కలపను మణుగూరు పురపాలకం పరిధిలోని శ్మశాన వాటికలకు తరలించేందుకు మాత్రమే అనుమతి ఉంది. కాగా ఆ కలపను ఓ ట్రాక్టరులో అశ్వాపురంలోని ఇటుకల బట్టీలకు కొందరు తరలిస్తుండగా సమాచారం అందుకున్న అశ్వాపురం అటవీ శాఖ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ట్రాక్టరు సహా కలపను అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు.

## నరికిన చోటే.. అంకురార్పణ

ఏడూళ్లబయ్యారం అడ్డరోడ్డు నుంచి పినపాక వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా గతంలో మొక్కలు నాటారు. కాలక్రమంలో అవి చెట్లుగా రూపాంతరం చెంది విద్యుత్తు తీగలకు అడ్డుగా రావడంతో పలు చెట్లను ఇటీవల తొలగించారు. ఈక్రమంలో ఓ చెట్టును సగం వరకు నరికేశారు. మిగిలిన ఆ మోడుకు చిన్నచిన్న కొమ్మలు వచ్చి చూపరులను ఆకర్షిస్తోంది. కొమ్మలు మొత్తం తొలగించినప్పటికీ పూర్వ వైభవాన్ని సంతరించుకునేలా చిగురించడం విశేషం. – పినపాక, న్యూస్‌టుడే



## చిట్టడవి కాదు.. క్రీడా ప్రాంగణం



ఈ చిత్రం చూస్తే ఇదేదో చిట్టడవి అనుకునేరు.. ఇది అశ్వారావుపేట మండలం మద్దికొండలోని క్రీడా ప్రాంగణం. గ్రామానికి దూరంగా దీన్ని ఏర్పాటు చేయడంతో క్రీడాకారులు ఎవరూ అక్కడకు వెళ్లడం లేదు. దీంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. దీనిపై ఎంపీవో ప్రసాద్‌రావును వివరణ కోరగా పిచ్చిమొక్కలను తొలగింప జేస్తామని 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

## 'ఆందోళన ఉద్ధృతం చేస్తాం'

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రామగుండంలో నిర్మించనున్న విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకుడు రాజబాబు అన్నారు. శుక్రవారం మణుగూరులోని బీటీపీఎస్‌లో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపిన అనంతరం ఆయన మాట్లాడారు. జెన్‌కో, సింగరేణి సంయుక్తంగా విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రవితేజ, ప్రసాద్, ప్రేమ్, వెంకట్రావ్, వీరస్వామి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## కబేళాకు తరలిస్తున్న గోవులు, ఎడ్ల స్వాధీనం

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కబేళాకు తరలిస్తున్న 20 గోవులు, ఎడ్లను అశ్వారావుపేట పోలీసులు రక్షించారు. ఎస్సై యయాతిరాజు కథనం ప్రకారం. ఆంధ్రాలోని తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన 20 గోవులు, ఎడ్లను రెండు వ్యాన్లలో హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా అశ్వారావుపేట శివారులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. నిందితులైన తునికి చెందిన దేవర దుర్గాప్రసాద్, అంగులూరి అశోక్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వాహనాలను సీజ్ చేశారు. పట్టుబడిన పశువులను పాల్వంచ గోసంరక్షణశాలకు తరలించారు.

## నేత్రదానం

అశ్వాపురం, న్యూస్‌టుడే: రామచంద్రాపురానికి చెందిన పగడాల అశోక్‌రెడ్డి మాతృమూర్తి వెంకటమ్మ(80) శుక్రవారం అనారోగ్యంతో భద్రాచలం ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందారు. వైద్యులు కుటుంబ సభ్యులను సంప్రదించగా ఆమె నేత్రాలను దానం చేశారు.

### తాత్కాలిక రహదారి నిర్మాణం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: తూరుబాక వద్ద తాత్కాలిక మెటల్ రహదారి నిర్మాణ పనులు పూర్తయి రాకపోకలు ఆరంభమయ్యాఇ. ఇటీవల కల్వర్టు దెబ్బతిని కుంగి పోవడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ అశోక్‌కుమార్, ర.భ.శాఖ డీఈ హరిలాల్ రోడ్డు నిర్మాణ పనులను పనులను యుద్ధ ప్రాతిపదికన చేయించారు.

### సెల్‌ఫోన్ టవరు నిర్మాణం నిలిపివేత

భద్రాచలం పట్టణం: స్థానిక జగదీశ్ కాలనీలో జనావాసాల మధ్య ఓ ఇంటి ఆవరణలో సెల్‌టవరు నిర్మాణం చేపడుతుండగా గ్రామ పంచాయతీ అధికారులు శుక్రవారం నిర్మాణం నిలిపివేశారు. కొంతకాలంగా కాలనీవాసులు ఇక్కడ టవర్ నిర్మాణం చేపట్టవద్దని ఆందోళనలు చేపడుతున్నారు. దీనిపై ఎమ్మెల్యేకు, అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇంటి యజమాని పట్టించుకోకుండా నిర్మాణ పనులు చేయిస్తుండటంతో పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు సిబ్బందితో అక్కడకు చేరుకుని పనులు నిలిపివేయించారు.

### ఉపాధి పనుల పరిశీలన

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం పనులను రైతులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. సుబ్బారావుపేట గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద రైతులు సాగు చేస్తున్న కొబ్బరి, మునగ, సీతాఫలం, జామ, మామిడి తోటలను, చేపల చెరువులను ఆమె పరిశీలించారు.

### మిషన్ భగీరథ డీఈకి సమ్మె నోటీసు

అశ్వాపురం, న్యూస్‌టుడే: మిట్టగూడెంలోని రథంగుట్ట వద్ద మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో పని చేసే కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం మిషన్ భగీరథ డీఈకి సమ్మె నోటీసు అందజేశారు. నాలుగు నెలల వేతనాల వేతనాలు ఇవ్వకపోవడంతో ఈనెల 5 నుంచి నిరవధిక సమ్మెకు ఉపక్రమించినట్లు వెల్లడించారు. సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

### వేతనాలు వెంటనే చెల్లించండి

అశ్వాపురం, న్యూస్‌టుడే: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో కార్మికులకు 3 నుంచి 9 నెలల వరకు వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం అశ్వాపురంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.

### ఏఎస్పీ కార్యాలయం ఇన్‌ఛార్జిగా డీఎస్పీ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఏఎస్పీ కార్యాలయం ఇన్‌ఛార్జిగా మణుగూరు డీఎస్పీ వి. రవీందర్‌రెడ్డి శుక్రవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ ప్రత్యేక శిక్షణకు వెళ్లడంతో ఉన్నతాధికారులు డీఎస్పీకి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

### యువకుడిపై దాడి.. గాయాలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలానికి చెందిన మణికంఠ అనే యువకుడిపై నలుగురు వ్యక్తులు స్థానిక శిల్పినగర్ కాలనీ సమీపంలో గురువారం రాత్రి దాడిచేయడంతో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### కోడి పందేల స్థావరంపై దాడి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధి జిన్నెలగూడెం శివారులో కోడి పందేల స్థావరంపై స్థానిక ఎస్సై గణేష్ శుక్రవారం దాడిచేశారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

### కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం: పాయం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మణుగూరులోని పగిడేరు ఎస్సీకాలనీకి చెందిన పలు కుటుంబాలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరగా పాయం వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకులు నవీన్, భిక్షం, తిరుమలేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీదేవి అవతారంలో అమ్మవారు



అశ్వారావుపేట గ్రామీణం: మామిళ్లవారిగూడెంలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న మహిళలు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అశ్వారావుపేట మండల వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కోలహలంగా సాగుతున్నాయి. అమ్మవారు శుక్రవారం గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరంగాపురంలో శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో పూజలు సాగాయి. మామిళ్లవారిగూడెంలో కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

★ దమ్మపేట: దేవీ నవరాత్రుల్లో భాగంగా మండలంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. గాయత్రీ ఆశ్రమంలో వ్యవస్థాపకులు ప్రేమ్‌సుస్థిర మూర్తీజీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. నాచారం జయలింగేశ్వరస్వామి, వడ్లగూడెం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి, దమ్మపేట శ్రీ విశ్వేశ్వరాలయం, నాగుపల్లి శివాలయాల్లో విశేష పూజలు సాగాయి.

★ అశ్వారావుపేట: వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 108 మందితో సామూహిక కుంకుమార్చన సాగింది.

★ అన్నపురెడ్డిపల్లి: శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని పలు ఆలయాల్లో శుక్రవారం అమ్మవారు గాయత్రిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సివిల్ ఆఫీస్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు.



పర్ణశాల రామాలయంలో మహాలక్ష్మి అంకరణతో..



మణుగూరులో గాయత్రిదేవిగా..

దుమ్ముగూడెం: పర్ణశాల రామాలయం, నడికుడి, చిన బండిరేవు ఆలయాల్లో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

**బతుకమ్మ సంబురాలు: ఆళ్లపల్లి, బూర్గంపాడు, న్యూస్‌టుడే:** ఆళ్లపల్లి ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారులు, సిబ్బంది బతుకమ్మను పేర్చి సందడిచేశారు. బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితోపాటు విద్యార్థులు ఆడి పాడారు.

## డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించిన ప్రత్యేకాధికారి



భద్రాచలం పట్టణం: సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం శాంతినగర్‌లో నిర్వహిస్తున్న కుటుంబ కార్డు డిజిటల్ సర్వేను రాష్ట్ర గనుల శాఖ కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్డీఓ దామోదర్‌రావు, తహసీల్దారు శ్రీనివాస్‌లకు డిజిటల్ కార్డు సర్వేపై పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక బ్రిడ్జి పాయింట్‌లో చెక్‌పోస్టు వద్ద ఇసుక లారీల వివరాలు నమోదుచేసే రిజిస్టరును తనిఖీ చేశారు. మైనింగ్ ఏడీ దినేష్‌కుమార్‌కు, సిబ్బందితో మాట్లాడారు.

దమ్మపేట, ములకలపల్లి, న్యూస్‌టుడే: దమ్మపేట మండలం అల్లిపల్లి, ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామాల్లో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల నమోదు ప్రక్రియను కలెక్టర్ జితేశ్ వి. పాటిల్, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం ప్రారంభించారు. డిజిటల్ కార్డుల ఆవశ్యకతను కలెక్టర్ గ్రామస్థులకు వివరించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ములకలపల్లి మండలం మూకమామిడిలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవనాలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పరిశీలించారు. పనుల్లో జాప్యం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

అశ్వాపురం: మండలంలోని చంద్రలబోడులో ఫ్యామిలీ హెల్త్ డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్ట్ సర్వే అశ్వాపురం తహసీల్దార్ బి. స్వర్ణ, బూర్గంపాడు తహసీల్దార్ ముజాహిద్దీన్, అశ్వాపురం ఎంపీఓ ముత్యాలరావు ఆధ్వర్యంలో మూడు గ్రూపులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహించారు.

## రూ.4 లక్షల బహుమతులు గెల్చుకున్న అప్పలరాజు





అప్పలరాజు కుటుంబ సభ్యులకు రూ.4 లక్షల బహుమతులు అందజేస్తున్న ఎల్‌జీ షోరూం నిర్వాహకులు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని ఎల్‌జీ షోరూంలో నిర్వహించిన ఇండియా కా సెలబ్రేషన్‌లో రాయిగూడెం గ్రామానికి చెందిన అప్పలరాజు విజేతగా నిలిచారు. శుక్రవారం స్థానిక ఎల్‌జీ షోరూంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కోలా శ్రీధర్ మాట్లాడుతూ అప్పలరాజు అనే వ్యక్తి తమ వద్ద రూ.28 వేల ఫ్రిజ్ కొనుగోలు చేశారన్నారు. దసరా, దీపావళి సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో అతను విజేతగా నిలిచాడన్నారు. దీంతో ఎల్‌జీ కంపెనీకి చెందిన రూ.4 లక్షల విలువ గల వస్తువులను అప్పలరాజుతోపాటు అతని కుటుంబ సభ్యులకు ఉచితంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ అసోసియేట్స్ అధినేత రామారావు, మార్కెటింగ్ మేనేజర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎకో బ్రిక్స్ తయారీలో ముందంజ

### జిల్లాలో ప్రథమ స్థానంలో సారపాక

బూర్గంపాడు, న్యూస్‌టుడే: మానవాళి మనుగడకు ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ నడుం బిగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఎకో బ్రిక్స్ తయారు చేయించాలని పంచాయతీల అధికారులను ఆదేశించారు. ఇటీవల చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలినిస్తోంది. ఎకో బ్రిక్స్ తయారీలో జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో సారపాక ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడ స్వల్ప వ్యవధిలో 2,150 ఎకో ఇటుకలను తయారు చేశారు. మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం నాలుగో స్థానంలో నిలిచింది. మొదటి పది స్థానాల్లో మండలంలోని రెండు పంచాయతీలు నిలవడంతో అధికారుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. కలెక్టర్ సైతం అధికారుల కృషిని ప్రత్యేకంగా కొనియాడారు. బూర్గంపాడు ఎంపీడీఓతో పాటు సారపాక, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం పంచాయతీ కార్యదర్శులను ఇటీవల కలెక్టరేట్‌లో సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. మిగిలిన పంచాయతీల్లోనూ ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బాటిళ్లలో నింపి ఇటుకలు తయారు చేసే ఈ ప్రక్రియతో ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించకుండా ఉంటాయి. భూమిలో కలిసి పర్యావరణం పాడయ్యే అవకాశం కూడా ఉండదు. సారపాక పంచాయతీ కార్యదర్శి మహేశ్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు.





సారపాకలో తయారు చేసిన ఎకోబ్రిక్స్ ఇలా



నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో తయారు చేసిన ఎకో బ్రిక్స్ ఇలా

## అమరారం టూ జోధ్‌పూర్..

### డ్యూయెల్ డిగ్రీ సీటు సాధించిన గిరిజన విద్యార్థిని

పినపాక, న్యూస్‌టుడే: పినపాక మండల పరిధిలో మారుమూల గిరిజన గ్రామం అమరారం. స్థానిక నర్సయ్య, రత్తమ్మ దంపతుల మూడో సంతానం వజ్జా మానస. ఎల్చిరెడ్డిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రాథమిక విద్య, మణుగూరు గిరిజన బాలికల ఆశ్రమ కళాశాలలో ఇంటర్, కొత్తగూడెంలో డిగ్రీ విద్యనభ్యసించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించిన మానస వారికి భారం కాకూడదనే భావనతో ఆశ్రమ వసతిగృహాల్లో ఉంటూ చదువుకున్నారు. డిగ్రీ పూర్తైన వెంటనే కళాశాల ఆచార్యురాలు ప్రోత్సాహంతో మార్చిలో నిర్వహించిన ఐఐటీ ప్రవేశ పరీక్ష రాశారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 5,042 ర్యాంకు సాధించి జోధ్‌పూర్ విశ్వవిద్యాలయంలో సీటు సంపాదించారు. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా మానస నాలుగు సంవత్సరాల్లో ఎంఎస్సీతో పాటు ఎంటెక్ సైతం పూర్తి చేయనుంది. మానస ప్రతిభను గుర్తించిన భద్రాచలం ఐటీడీఏ అధికారులు ఖర్చుల నిమిత్తం రూ.50 వేల నగదు అందజేశారు. భోజన, వసతికి సంబంధించి ప్రతియేటా రూ.52 వేల మేర చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయ కూలీలుగా జీవనం గడుపుతున్న ఆ కుటుంబానికి ఈ ఫీజు సైతం భారంగా మారింది. దాతలు సహకరిస్తే ఆటంకం లేకుండా చదువు పూర్తవుతుందని మానస పేర్కొంటున్నారు.



జోధ్‌పూర్ విశ్వవిద్యాలయం వద్ద వజ్జా మానస

కొత్తగూడెం
• కొత్తగూడెం • ఇల్లెందు

## అమ్మవారికి పూజలు.. విరిసిన బతుకమ్మలు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పెద్దమ్మతల్లి ఆలయంలో రెండోరోజు శుక్రవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన అర్చకులు ఉదయం లక్ష్మీగణపతి అనుష్ఠానాలు, వేదపారాయణం, నవగ్రహ జపములు తదితర పూజలు.. మధ్యాహ్నం చండీహోమం, లక్షకుంకుమార్చన నిర్వహించారు. ఈవో ఎన్.రజనీకుమారి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ ఆవరణలోని వివిధ దుకాణాలకు శుక్రవారం వేలం నిర్వహించినట్లు ఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

టేకులపల్లి: బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. టేకులపల్లి కోదండ రామాలయం వద్ద శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు హాజరయ్యారు. అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. సీడీపీఓ కేఎం తార, సూపర్‌వైజర్లు అనురాధ, లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, రెడ్యానాయక్, మంగీలాల్, గణేశ్ పాల్గొన్నారు.

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రతిభ వొకేషనల్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆడపడుచులు, విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి నృత్యాలు చేశారు. టీపీసీసీ సభ్యులు జేబీ శౌరి, 29వ వార్డు కౌన్సిలర్ తంగెళ్ల లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం రాజశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



టేకులపల్లి కోదండ రామాలయంలో అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే కోరం



ఇల్లెందు గ్రామీణం: 15వ వార్డులో కొలువైన దుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక అలంకరణ



కొత్తగూడెం: బతుకమ్మలతో విద్యార్థులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు..





ఇల్లెందు గ్రామీణం: నం.2 బస్తీ భజన మందిరంలో గౌరీదేవి అలంకారం



కొత్తగూడెం సింగరేణి: ప్రధాన కార్యాలయంలో..

పాల్వంచ పట్టణం: గాయత్రీ దేవిగా అమ్మవారి దర్శనం

## 'రూ.10 నాణేలు చెల్లుతాయి'

చుంచుపల్లి, న్యూస్‌టుడే: పది రూపాయల నాణేలు చెల్లుబాటు అవుతాయని, వాటిని వినియోగంలో ఎవరూ తిరస్కరించవద్దని రుద్రంపూర్ ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ ఈశ్వరరావు అన్నారు. బ్యాంకు ఖాతాదారులు, చిరు, వర్తక వ్యాపారులకు శుక్రవారం బ్యాంకు ఆవరణలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ మేనేజర్ వెంకన్న, క్యాషియర్ శశిప్రీతం, వరుణ్ సాయి పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689

సమస్య: జిల్లా ఆర్టీఓ కార్యాలయం, పోస్టాఫీస్ కార్యాలయం సమీపంలో చెత్తాచెదారాన్ని తొలగించడం లేదు. దుర్వాసనతో సిబ్బంది, కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారు. - పాఠకులు

సమాధానం: ఆ ప్రాంతంలోని పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను తొలగిస్తాం. - వీరభద్రాచారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ - కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

పాల్వంచ కొమ్ముగూడెం కాలనీలో డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. - అప్పారావు, స్థానికుడు

✔ ఏరియా జవాన్‌కు చెప్పి సమస్య పరిష్కరిస్తాం. - కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి - పాల్వంచ, న్యూస్‌టుడే

# ఊరెళ్తున్నారా.. వారికో మాట చెప్పారా?

## దసరా సెలవుల్లో దొంగల బెడద

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే

దసరా సెలవులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 14వ తేదీ వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన పలు కుటుంబాలు పిల్లలతో సహా సొంత గ్రామాలకు బయల్దేరి వెళ్తున్నాయి. ఇదే తరుణంలో తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరులు విజృంభించే అవకాశం ఉంది. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఊరెళ్లే వారు కొన్ని స్వీయ జాగ్రత్తలు పాటించాలని కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు రెండ్రోజుల ముందు నుంచే ప్రచారం ప్రారంభించారు. ప్రత్యేక ప్రచార వాహనం సాయంతో కాలనీల్లో ప్రచారం చేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. సమస్యాత్మక కాలనీల్లో గస్తీ ముమ్మరం చేశారు.

### రెండ్రోజులు రెక్కీ.. పగటి పూటే చోరీ

సబ్ డివిజన్ పరిధిలో దొంగతనాల్లో ఎక్కువ శాతం పగటి వేళలోనే చోటుచేసుకోవడం గమనార్హం. ఇంట్లో ఎవరూ లేకుండా ఉండి, తాళం వేసి ఉన్నట్లయితే చాకచక్యంగా చేతివాటం ప్రదర్శించడం కొన్ని ముఠాలకు పరిపాటిగా మారిందని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం కొందరు దొంగలు ముఠాతో రెక్కీ నిర్వహిస్తున్నట్లు పలు కేసుల విచారణలో తేలింది. ఒకటి, రెండు రోజులు రెక్కీ చేయడం, ఆ తర్వాత సమయం చూసి క్షణాల్లో ఇంటిని దోచేయడం జరుగుతోంది. ఫలితంగా ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగొచ్చేలోగా బీరువాలను సర్దుకుపోతున్న తీరు అవాక్కయ్యేలా చేస్తోంది. ఇక రోజుల పాటు ఊరెళ్తే భద్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా స్థానిక పోలీసు అధికారులు సైతం గస్తీని విస్తృతం చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. అనుమానిత ముఠాలపై ముందే నిఘా పెట్టాలని వేడుకుంటున్నారు.



ఓ బంగారు దుకాణానికి కన్నం వేసిన దొంగలు (పాతచిత్రం)

### ఈ జాగ్రత్తలు మేలు

☛ ఇంటికి తాళం వేసి అందరూ వెళ్లకుండా ఎవరో ఒకరు కుటుంబ సభ్యులు ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. ● అలా వీలుకాని పక్షంలో ఇంట్లో విలువైన వస్తువులు, నగదు, పత్రాలను వెంట తీసుకెళ్లడం, లేదా వేరే చోట భద్రపరుచుకోవడం ఉత్తమం. ● అదీ సాధ్యం కాకుంటే బీరువా తాళాలను ఇంట్లోని పోపు డబ్బాలు, దిండ్లు, డ్రెస్సింగ్ టేబుల్స్‌లో దాచిపెట్టొద్దు. ● కుటుంబ సమేతంగా ఎక్కువ రోజులు ఊరికి వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలి. ఆయా ప్రాంతాల్లో బ్లూకోల్ట్స్ బృందాలు గస్తీ కాసేలా పోలీసు అధికారులు చర్యలు చేపడతారు. ● సాధారణ తాళాలకు బదులు అంత త్వరగా తెరుచుకోని గట్టి తాళాలు వినియోగించాలి. ● బయటకు వెళ్లే సందర్భాల్లో ఇరుగుపొరుగుకు ఇంటిపై ఓ కన్నేసి ఉంచమని చెప్పాలి. ● ఇంట్లో, ఆవరణలో లైట్లు వేయడం ద్వారా ఎవరో ఉన్నారన్న సందేశాన్ని బయటి వ్యక్తులకు ఇవ్వాలి.

### ప్రజా భాగస్వామ్యం అవసరం: అబ్దుల్ రెహ్మాన్, డీఎస్పీ



దొంగతనాల కట్టడిలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం. వారు అప్రమత్తంగా ఉంటూ స్వీయ జాగ్రత్తలు పాటించాలి. సెలవుల్లో ఊరికి వెళ్తున్నామని చెబితే పెట్రోలింగ్ పెంచుతాం. విలువైన వస్తువుల పట్ల బాధ్యతగా ఉండాలి. సెలవుల్లో పిల్లలు చెరువులు, కాలువలు, కుంటలు, వాగుల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలి. వరదల కారణంగా అవి ప్రమాదకరంగా తయారయ్యాయి. చూడటానికి ప్రశాంతంగా ఉన్నప్పటికీ లోతు అంచనా వేయలేక ప్రమాదానికి గురయ్యే అవకాశాలుంటాయి. తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎంతైనా అవసరం.

## బెదిరించిన వ్యక్తికి రిమాండ్

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: చుంచుపల్లి హౌసింగ్‌బోర్డుకు చెందిన గుంటూరు శ్రీను విలేకరి, పోలీస్ అని చెప్పుకొంటూ వారం క్రితం రేగళ్ల కొత్తూరు వద్ద ఓ వాహనదారుణ్ని బెదిరించాడు. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బాధితుడు స్థానిక పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో శ్రీనును శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై గతంలో ఖమ్మంలో పలు కేసులున్నట్లు ఎస్సై రమణారెడ్డి తెలిపారు.

## దుకాణంలో చెలరేగిన మంటలు

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ కేటీపీఎస్ శిక్షణ కేంద్రం సమీపంలో భద్రాచలం జాతీయ రహదారి పక్కనున్న ఓ దుకాణంలో శుక్రవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బందికి అక్కడకు వచ్చి మంటలను ఆర్పేశారు.

## బ్యాంకులో ఏసీ దగ్ధం

సుజాతనగర్, న్యూస్‌టుడే: సుజాతనగర్ శుక్రవారం సాయంత్రం గాలివాన సమయంలో ఎస్‌బీఐలోని ఏసీలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలొచ్చాయి. మేనేజర్ శివ వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేసి ఫైర్ నియంత్రికతో మంటలను ఆర్పేశారు. యంత్రం పూర్తిగా దగ్ధమైంది.

## టిప్పర్ కార్మికుల సమ్మె నోటీసు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కోయగూడెం ఉపరితల గని నుంచి పలు ప్రాంతాలకు బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్ కార్మికుల వేతనాలను పెంచాలని రెండు ఇఫ్టూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం టిప్పర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులకు సమ్మె నోటీసు అందజేశారు. నాయకులు రాసుద్దీన్, మోహన్‌రావు, నూనేశ్వరరావు, లాలు పాల్గొన్నారు.

## సురక్షిత తాగునీటి సరఫరాతోనే వ్యాధులు దూరం



మాట్లాడుతున్న డీపీవో చంద్రమౌళి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహాయకులు చూసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సూచించారు. జూలూరుపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు ఆయన శుక్రవారం హాజరయ్యారు. డీపీవో మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపాలన్నారు. డీఎల్‌పీవో రమణారావు, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎంపీవో తులసీరామ్, డీఈ శివయ్య పాల్గొన్నారు.

## కళాశాలలో స్వాగత వేడుకల సందడి

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాగతపు వేడుకలను ప్రిన్సిపల్ పసుపులేటి శంకర్ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. డీఐఈఓ వెంకటేశ్వరరావు జ్యోతిని వెలిగించి వేడుకల్ని ప్రారంభించారు. సీనియర్ ప్రిన్సిపల్ సులోచనారాణి, జిల్లా ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు శేషుబాబు, లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు ఖుర్షీద్ అహ్మద్ పాల్గొన్నారు.

## నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

లక్ష్మీదేవిపల్లి: లక్ష్మీదేవిపల్లి హైవేపై బస్టాప్ వద్ద దుకాణాలు, సమీప కాలనీలు, బస్సులను స్థానిక ఎస్సై రమణారెడ్డి ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల అనర్థాలను స్థానికులకు ఎస్సై వివరించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది, హెడ్‌కానిస్టేబుల్ రఘురాంరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

## 'అసంపూర్తి ఇళ్లను పూర్తిచేసి.. పేదలకు కేటాయించాలి'

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం అసంపూర్తిగా నిర్మించిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి పేదలకు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ డిమాండ్ చేశారు. కూలీలైన్‌లో శుక్రవారం ఏర్పాటైన శాఖ మహాసభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుల కొరతను అధిగమించి అందరికీ వైద్యం అందేలా చూడాలన్నారు. లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, డి.వీరన్న, లక్ష్మి, మీనా, నర్సయ్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

## 'పంచాయతీల విలీన కుట్రను తిప్పికొడతాం'

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కొత్తగూడెం, పాల్వంచ జంట పట్టణాలను కార్పొరేషన్ చేయాలనే పేరుతో గ్రామ పంచాయతీలను విలీనం చేసేందుకు జరుగుతున్న కుట్రను తిప్పికొడతామని ఎస్టీ సంఘాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. పట్టణంలో ఏర్పాటైన ఐక్య వేదిక సమావేశంలో శుక్రవారం నాయకులు మాట్లాడుతూ.. షెడ్యూల్ చట్టాల ప్రకారం పంచాయతీల విలీనం కుదరదన్నారు. లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు బుచ్చయ్య పాల్గొన్నారు.

## జిల్లా సర్వజన ఆసుపత్రిలో తప్పిన ప్రమాదం

కొత్తగూడెం వైద్యవిభాగం: జిల్లా సర్వజన ఆసుపత్రిలో ప్రమాదం త్రుటిలో తప్పింది. పైపులైన్ల కోసం గురువారం రాత్రి ఆసుపత్రి ఆవరణలో తవ్వకాలు చేపట్టారు. భూగర్భంలోని వైర్లకు గునపం తగలడంతో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. మంటలు వ్యాపించాయి. విద్యుత్ శాఖ అధికారులు అర్ధరాత్రి వరకు సిబ్బంది మరమ్మతులు పూర్తిచేశారు. విద్యుత్తును పునరుద్ధరించారు. దవాఖానాలో జనరేటర్ లేకపోవడంతో ఇన్‌పేషంట్లు అల్లాడారు.

## ప్రమాదాల నివారణ చర్యలపై డీఎస్పీ పరిశీలన

టేకులపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోనే అత్యధిక రద్దీ నెలకొన్న రెండో రహదారి.. ఇల్లెందు-కొత్తగూడెం ప్రధాన మార్గంలో ప్రమాదాల నివారణ చర్యలను ర.భ. శాఖ, హైవే అధికారులతో కలిసి డీఎస్పీ చంద్రభాను శుక్రవారం పరిశీలించారు. అనిశెట్టిపల్లి, కారుకొండ క్రాస్‌రోడ్, లాల్‌తండా, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, టేకులపల్లి, ఆరోమైలు వద్ద అప్రోచ్ రోడ్లను పరిశీలించారు. హెచ్చరికలు, వేగ నియంత్రికల బోర్డులు, మార్జిన్ల చదును, పొదల తొలగింపు, మరమ్మతులు, రేడియం స్టడ్స్ ఏర్పాటుకు నిర్ణయించారు. సీఐ టి.సురేశ్, ఎస్సై పి.సురేశ్, ఏఈ మోతీలాల్, ఆలీ పాల్గొన్నారు.

## ఘాట్‌ల వద్దే బతుకమ్మలను నిమజ్జనం చేయాలి

పాల్వంచ గ్రామీణం: బతుకమ్మల నిమజ్జనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘాట్లలో నిర్వహించుకోవాలని గ్రామీణం, పట్టణం ఎస్సైలు సురేశ్, సుమన్ తెలిపారు. చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేసే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలను వెంట తీసుకెళ్లొద్దని వారు సూచించారు.

## రోడ్డు పక్కనే.. పొంచిఉన్న ప్రమాదం



కొత్తగూడెం వెళ్లే మార్గంలో ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో రహదారి పక్కన ఉన్న గుంత ప్రమాదకరంగా మారింది. టెలిఫోన్ తీగల మరమ్మతుల కోసం ఏర్పాటుచేసిన ఈ గుంతను వాహనాలు గమనించకుంటే ప్రమాదాల బారినపడే ఆస్కారం ఉంది. సుభాష్‌నగర్ ఇన్‌ఛార్జి కార్యదర్శి అజహార్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
– ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

## ప్లాస్టిక్ వ్యర్థాలతో.. మూగజీవాలకు ముప్పు



కొత్తగూడెం పట్టణంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారులు, డ్రైనేజీలు నిషేధిత కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లతో నిండిపోతున్నాయి. కొన్ని మూగజీవులు వాటిని తినడంతో అనారోగ్యం పాలవుతున్నాయి. ✦ వ్యర్థాలను బయట పడేయకుండా చర్యలు చేపడతామని స్థానిక మున్సిపల్ అధికారులు 'న్యూస్‌టుడే'తో అన్నారు. – కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

## తీగలు తొలగించారు.. సరఫరా మెరుగుపరిచారు



ఈనాడు కథనానికి స్పందన

మండలంలోని కొత్తూరు రహదారి సమీపంలో జడలచింత వద్ద 11 కె.వి. విద్యుత్తు స్తంభాన్ని పచ్చని తీగలు అల్లుకున్నాయి. సమస్యపై 'ఈనాడు'లో ఈనెల 3న 'అల్లుకున్న నిర్లక్ష్యం..!' శీర్షికన కథనం రావడంతో ఏఈ సతీశ్‌కుమార్ స్పందించి.. స్తంభానికి అల్లుకున్న తీగలను తొలగించారు.
– జూలూరుపాడు, న్యూస్‌టుడే

## వన్యప్రాణులను వేటాడొద్దు



పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: వన్యప్రాణులను వేటాడితే నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేస్తామని వన్యప్రాణి సంరక్షణ విభాగం ఎఫ్‌డీవో బాబు అన్నారు. వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని పాల్వంచ అటవీ శాఖాధికారులు పాల్వంచలో ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణులను కాపాడాలని అవగాహన కల్పించారు. రేంజర్ కవితా మాధురి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రూ.8.50 కోట్లతో సింగభూపాలెం చెరువు సుందరీకరణ

సుజాతనగర్, కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువు అభివృద్ధి, సుందరీకరణకు రూ.8.50 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రభుత్వం అందజేసిన లక్ష ఉచిత చేప పిల్లలను ఆయన చెరువులో శుక్రవారం వదిలారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ.. కాకతీయుల కాలం నాటి పురాతన చెరువు ఆయకట్టుకు 'సీతారామ' ఎత్తిపోతల ద్వారా 2 వేల ఎకరాలకు, నియోజకవర్గంలో 25 వేల ఎకరాలకు సాగునీరు అదనంగా అందించేందెలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి ఖదీర్ అహ్మద్, జిల్లా అధికారి ఇంతియాజ్, ఇరిగేషన్ ఈఈ అర్జున్, డీఈ భాస్కర్, టీపీసీసీ సభ్యుడు నాగసీతారాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కూనంనేని, పక్కన నాయకులు

**బాధిత కుటుంబాలకు చెక్కులు..**

విధి నిర్వహణలో విద్యుత్తు ప్రమాదంతో మృతిచెందిన మున్సిపల్ కార్మికుడు దుర్గా ప్రసాద్, అవగాహనా లేక దోమల మందుతాగి ప్రాణాలు కోల్పోయిన కార్మికురాలు ఓదెమ్మ కుటుంబాలకు ఎమ్మెల్యే కూనంనేని ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. తన క్యాంపు కార్యాలయంలో ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల విలువైన చెక్కులను ఆయన అందజేశారు. ఓదెమ్మ కుటుంబంలో ఒకరికి తాత్కాలిక ఉద్యోగాన్ని కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఛైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్‌స్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు..**

పేదింటి యువతుల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెంలోని క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల లబ్ధిదారులకు రూ.66,07,656ల చెక్కులను శుక్రవారం అందజేశారు. తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణ, కమిషనర్ శేషాంజన్‌స్వామి పాల్గొన్నారు.

పాల్వంచ: బొల్లోరిగూడెంలో కొనసాగుతున్న కుటుంబ డిజిటల్ కార్డు పైలెట్ సర్వేను ఎమ్మెల్యే కూనంనేని శుక్రవారం పరిశీలించారు. ఆర్డీఓ మధు, తహసీల్దార్లు వివేక్, పుల్లయ్య పాల్గొన్నారు.

## తొలిదశ ఉద్యమకారుడు భాస్కరరావు మృతి



కొత్తగూడెం కలెక్టరేట్: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు, సింగరేణి విశ్రాంత ఉద్యోగి అల్లి భాస్కరరావు (80) శుక్రవారం మృతిచెందారు. కొత్తగూడెం గాజులరాజం బస్తీలోని నివాసంలో భాస్కరరావు మృతదేహానికి 1969 తెలంగాణ ఉద్యమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య, కాకెల్లి సైమన్, దామరకొండ మల్లయ్య, ఎండీ మౌలానా, వలి బాబు, శ్రీపాద సత్యనారాయణ, రామమూర్తి, సఫ్దార్‌బేగ్ తదితరులు నివాళులు అర్పించారు.

## ట్యాక్స్ కన్సల్టెంట్ శ్రీనివాసరాజు..



కొత్తగూడెం సాయినగర్‌కు చెందిన సెల్స్ ట్యాక్స్, ఇన్‌కం ట్యాక్స్ కన్సల్టెంట్ కూరపాటి శ్రీనివాసరాజు (53) శుక్రవారం మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సిద్ధ సమాధి యోగా సభ్యుడిగా, మల్లేశ్ గురూజీ శిష్యుడిగా మంచి గుర్తింపు పొందారు. ఆడిటర్ సజ్జా ప్రసాద్, డా.అత్తులూరి వెంకటేశ్వరరావు, లగడపాటి రమేష్, నవభారత్ ఏజీఎం వగల హరికృష్ణ, సల్లూరి నిరంజన్ తదితరులు కూరపాటి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

## నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

టేకులపల్లి: మండల కేంద్రంలోని ఎ.బాలరాజు కిరాణంలో విక్రయిస్తున్న రూ.18 వేల విలువైన పొగాకు ఉత్పత్తులను శుక్రవారం ఎస్సై సురేశ్ స్వాధీనం చేసుకున్నారు. దుకాణ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

# ఆ ఒక్క పోస్టు.. తనదే అనుకుని..!

పాల్వంచ, న్యూస్‌టుడే

అదో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్. ఉన్నది ఒకేఒక పోస్టు. చాలామంది తమ వల్ల కాదులే? అని నిరుత్సాహపడతారు. పోటీ తట్టుకుంటామా? అనే సందేహంతో వెనుకడుగు వేస్తారు. కానీ ఆమె అందరిలా ఆలోచించలేదు. ఆ ఒక్క ఉద్యోగం తనదే అన్న ఆత్మవిశ్వాసంతో సన్నద్ధత ప్రారంభించారు. పేదరికంలో ఎదురైన అవరోధాలకు తొణకలేదు, బెణకలేదు. పట్టుదలతో ముందుకు సాగితే విజయం తథ్యం అని నిరూపించారు. ఆమే.. ఇల్లెందు మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన లావుడ్యా మంజుల.

సుదీర్ఘ విరామం తర్వాత డీఎస్సీ-2024 నోటిఫికేషన్ మార్చిలో విడుదలైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక విద్యతో పాటు వ్యాయామ టీచర్ల పోస్టులు మొత్తం 447 ప్రకటించారు. వీటిల్లో పీఈటీ పోస్టు ఒకటి, పీడీ పోస్టులు నాలుగున్నాయి. వందల సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంత పోటీ తట్టుకుని తాను విజయం సాధించగలనా? అని మంజుల సందేహించలేదు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేశారు. పేద కుటుంబం.. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులెదురైనా వెనుకంజ వేయలేదు. ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకుని, ప్రత్యేక నోట్సు రూపొందించుకున్నారు. రేయింబవళ్లు చదివారు. అనుకున్నట్టుగానే అంతిమ విజయం ఆమెకు లభించింది. ఇటీవల వెల్లడైన డీఎస్సీ ఫలితాల్లో పీఈటీ అభ్యర్థుల్లో జిల్లా స్థాయిలో ఒకటో ర్యాంకు, పీడీ పోస్టుల్లో 2వ ర్యాంకు దక్కించుకుని ప్రతిభ చాటుకున్నారు.



'మాది ఇల్లెందు మండలం. నాన్న తులశ్యా ఆటో డ్రైవర్. అమ్మ పరేంగ వ్యవసాయ కూలీ. వారి రెక్కల కష్టంతో నన్ను నల్గొండలో బీపీఈడీ చదివించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎంపీఈడీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. పాఠశాల స్థాయి నుంచే వ్యాయామ ఉపాధ్యాయురాలిని కావాలనే కోరిక ఉంది. ఈ కల నెరవేర్చుకునేందుకు డీఎస్సీ కోసం నిరీక్షించా. హైదరాబాద్‌లోని ఓ గురుకులంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం చేసేదాన్ని. డీఎస్సీ నోటిఫికేషన్ రాగానే ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుని సొంతంగా సన్నద్ధమయ్యా. నా కలను ఎట్టకేలకు సాకారం చేసుకున్నా. మేం ముగ్గురం సంతానం. ఇద్దరు అక్కలకు వివాహాలయ్యాయి. అమ్మానాన్నల కష్టాలు తీర్చాలనే సంకల్పంతో పోటీపరీక్షలో విజయం సాధించడం ఆనందంగా ఉంది. కలల కొలువులకు సిద్ధమయ్యే వారెవరైనా పోటీ ఎంతనే విషయాన్ని ఆలోచిస్తే అక్కడితే అడుగు ఆగిపోతుంది. ప్రయత్నంలో ప్రణాళికాయుతంగా ముందుకు సాగితే విజయం దరిచేరుతుంది అనేందుకు నేనే ఓ ఉదాహరణ'. – లావుడ్యా మంజుల

## క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి

పాల్వంచ: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. పాల్వంచ అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు శుక్రవారం ఆయన హాజరై మాట్లాడారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కళాశాల ఛైర్మన్ భరత్‌కృష్ణ, కరస్పాండెంట్ అవని, డైరెక్టర్ సుబ్బారావు, ప్రిన్సిపల్ రవికుమార్ పాల్గొన్నారు.

## 'సైలెంట్'గా వచ్చి.. 'సౌండ్' బాక్సులు దొంగిలించి..



ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ముకుందాపురం గ్రామంలోని ఆర్‌కే సౌండ్స్‌లో సుమారు రూ.70వేల విలువైన డీజే సౌండ్ పరికరాలను గురువారం అర్ధరాత్రి ఓ వ్యక్తి దొంగిలించాడు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో చోరుని కదలికలు, డీజే సామగ్రిని అపహరించే దృశ్యాలు నమోదయ్యాయి. బాధితుడు రామకృష్ణ శుక్రవారం ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## చెట్టు కూలి ఇద్దరికి గాయాలు

సుజాతనగర్: మండలంలో గాలివాన శుక్రవారం బీభత్సం సృష్టించింది. సీతంపేటబంజరలో వసంతాల ముత్యాలమ్మ గుడిపై భారీ చెట్టు కూలిపడింది. వానొస్తుందని అప్పటికే ఆలయంలోకి వెళ్లిన ముగ్గురు వ్యక్తులు భయంతో కిందకు దూకారు. వీరిలో మున్యాకు చెయి విరగగా, రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. మరో రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి.



చెట్టు కూలి నేలమట్టమైన గుడి

## భారాస నాయకులపై ఫిర్యాదు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చిత్రపటం దహనం చేసిన భారాస మహిళా నాయకులపై కేసు నమోదు చేయాలని ఇల్లెందు మహిళా కాంగ్రెస్ నాయకులు గాలిపల్లి స్వరూప స్థానిక సీఐ బత్తుల సత్యనారాయణకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. భారాస వార్డు కౌన్సిలర్ కటకం పద్మావతి ఆధ్వర్యంలో పలువురు మంత్రిని అసభ్య పదజాలంతో దూషించారని ఆమె పేర్కొన్నారు. కమలాబాయి, చెంచమ్మ, వెంకటలక్ష్మి, విజయభారతి, అనిత, సరస్వతి పాల్గొన్నారు.